మొబైల్ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలి

సీసీసీనస్పూర్ : యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- వినియోగదారులకు అవగాహన కల్పించిన అధికారులు, సిబ్బంది

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 18: వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, తదితర యాప్స్ ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులపై నస్పూర్ మున్సిపాలిటీలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం నస్పూర్ విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తి ఆధ్వర్యంలో సీసీసీ, తీగల్‌పహాడ్, శ్రీరాంపూర్‌కాలనీ, నస్పూర్ ఏరియాలోని కిరాణా దుకాణాలు, వెల్డింగ్ షాపులు, రైస్‌మిల్లులతో పాటు ఇంటింటికీ తిరిగి ప్రజలకు యాప్స్ ద్వారా బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించారు.

జన్నారంలో..

జన్నారం, అక్టోబర్ 18 : మండలంలోని కలమడుగు, కామన్‌పల్లి, దేవునిగూడ, జన్నారం, పొనకల్ గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఏవో యాదగిరి నరేందర్ రావు ఆధ్వర్యంలో డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించారు.

కాసిపేటలో..

కాసిపేట, అక్టోబర్ 18 : విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కాసిపేట విద్యుత్ ఏఈ స్వర్ణలత సూచించారు. బుధవారం కాసిపేట మండలంలోని కొండాపూర్, దేవాపూర్, కాసిపేట తదితర గ్రామాల్లో కిరాణా షాపులు, ఇళ్లలో ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపుపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్,అక్టోబర్18: మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులపై వినియోగదారులకు ఏఈ ఈ ప్రభాకర్ బుధవారం తాండూర్‌లోని ఐబీలో అవగాహన కల్పించారు. ఆయన వెంట జూనియర్ లైన్‌మన్ నరేశ్ ఉన్నారు.

భీమినిలో..

భీమిని, అక్టోబర్ 18 : మండలంలోని విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ ఏఈ బాపు తెలిపారు. బుధవారం భీమిని మండలంలోని విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్‌బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట : అవగాహన కల్పిస్తున్న ఏఈ స్వర్ణలత

తాండూర్‌లో..

ఘనంగా మహా చండీయాగం

అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 18 : దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని కైలాసగిరి కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఆలయం వద్ద మున్సిపల్ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ గాయత్రి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం మహా చండీయాగం కన్నుల పండువగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణం ప్రజలు సుఖంగా సంతోషంగా ఉండాలని, ఐదో వార్డు ప్రజలు చల్లగా ఉండాలని చండీయాగం పూజ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు రాజకుమారి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కల్వరీ చర్చిలో ఉపవాస దీక్షల ముగింపు

ఉపవాస ముగింపు దీక్షకు ఏర్పాటైన వేదిక

కాసిపేట, అక్టోబర్ 18 : సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్షల ముగింపు సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సాయంత్రం జరిగే సభకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాదీ పాస్టర్ ప్రవీణ్ 50 రోజులు ఉపవాస దీక్షలు చేపడుతారు. ఈ ఏడాది 11వ ఉపవాస దీక్షల ముగింపు సభకు సుమారు 70 ఎకరాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. సభ కోసం క్రైస్తవులు ఒక రోజు ముందుగానే సభ వద్దకు చేరుకుంటున్నారు. కల్వరీ చర్చి సమీపంలో నుంచి సభ వరకు రహదారి పక్కన భారీగా హోటళ్లు, తినుబండరాలు, బొమ్మలు వివిధ రకాల తాత్కాలిక షాపులను ఏర్పాటు చేశారు. ఈ సభకు జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచి క్రైస్తవులు సుమారు 2 లక్షల మంది హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బీఆర్ఎస్ యూత్ నాయకుల ప్రచారం

చికెన్ సెంటర్ నిర్వాహకుడికి మ్యానిఫెస్టో పత్రం అందజేస్తున్న యూత్ నాయకులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 18: నస్పూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి కాటం రాజు ఆధ్వర్యంలో పలు కాలనీల్లో తిరుగుతూ ప్రచారం కొనసాగించారు. ఇటీవల బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుతోనే మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, మంచిర్యాల ప్రశాంతంగా ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు మహ్మద్ సాజిద్, చెరుకు అజయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బెల్లంపల్లి, అక్టోబర్ 18: పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో నవ విధ లక్ష పుష్పార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి ఉమాప్రసాద్, కోశాధికారి రాజు, అన్నదాన ఇన్‌చార్జి ఆడెపు రమేశ్, ప్రచార కార్యదర్శి లక్ష్మీనారాయణ, పద్మశాలీ సేవా సమాజం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి భావనరుషి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 18 : జిల్లా కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పదవ తరగతిలో 52 మందికిగాను 37 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 65 మంది విద్యార్థులకు గాను 42 మంది హాజరుకాగా 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

అంతర్జాతీయ ఆన్‌లైన్ డ్రాయింగ్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన కార్మెల్ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 18 : అంతర్జాతీయ ఆన్‌లైన్ డ్రాయింగ్ మేళాలో పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. రామాయణం థీమ్‌పై కాసుల చిత్ర కళా అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ డ్రాయింగ్ పోటీల్లో కార్మెల్ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని వీ లక్ష్మీ ప్రియాంక సత్తా చాటి కాంస్య పతకం సాధించింది. లక్ష్మీ ప్రియాంకను హెచ్ఎం సిస్టర్ రిన్సీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఫాజియా బేగం, జీ హాసిని, కే రిషిత, ఆర్ నీతూ, ఎస్ రమ్య, వీ లక్ష్మీనందిని, కే అక్షిత, యం నితీన్, పీ సుకుమార్‌కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ డీ సత్యప్రసాద్‌ను ఈసందర్భంగా ప్రశంసించారు.

'డిపీ ఐటీఐను సీజ్ చేయాలి'

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 18 : పట్టణంలోని రాంనగర్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న డిపీ ఐటీఐపై చర్యలు తీసుకొని కళాశాలను సీజ్ చేయాలని జాతీయ విద్యార్థి సమాఖ్య(జేవీఎస్) ఆధ్వర్యంలో ఐటీఐ జిల్లా కన్వీనర్ కార్యాలయంలో బుధ వారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐటీఐలో కనీస మౌలిక సౌకర్యాలు లేవని, ఎక్విప్‌మెంట్స్ ఏమీ లేవన్నారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, అర్హత లేని వారితో బోధన చేయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు కళాశాలను సందర్శించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, సాయి, నవీన్, రాకేశ్, రవి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ జాతీయ కార్యవర్గంలో మధుసూదన్ రెడ్డి

వీ.మధుసూదన్ రెడ్డి

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 18 : క్రెడాయి (కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ వ్యాపార రంగ (నిర్మాణరంగ) సంస్థలోని జాతీయ కార్యవర్గంలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వీ.మధుసూదన్‌రెడ్డికి చోటు లభించినట్లు వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 2017 వ సంవత్సరంలో క్రెడాయి మంచిర్యాల్ చాప్టర్‌గా 18 నెల పాటు చైర్మన్‌గా వ్యవహరించినట్లు, అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు బాధ్యతలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్రెడాయ్ జాతీయ కార్యదర్శి గుమ్మి రామిరెడ్డి ఆహ్వానం మేరకు చైర్మన్ జగదీశ్ బాబు ఆధ్వర్యంలో క్రెడాయ్ తెలంగాణ నుంచి సభ్యుడిగా తనకు అవకాశం వచ్చినట్లు వెల్లడించారు. డిసెంబర్ 12, 13న హైదరాబాద్‌లో జరగబోయే క్రెడాయ్ నేషనల్ స్టడీ టూర్ పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

'జనహిత' సేవలు అభినందనీయం

బెల్లంపల్లి, అక్టోబర్ 18: జనహిత సేవా సమితి సేవలు అభినందనీయమని బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ అన్నారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో మద్దెల లక్ష్మి, రాజనర్సు దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, సహాయ కార్యదర్శి పంతంగి సంతోష్, కార్యవర్గ సభ్యులు నిచ్చకోలా గురుస్వామి, అక్షయ్, నాయకులు కట్ల యాదగిరి, ఉమాకాంత్, కుంబాల రాజేశ్, కాసర్ల యాదగిరి, పైడిమల్ల చంద్రశేఖర్, సుభాష్, శివ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో అభయ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

శ్రీరాంపూర్, అక్టోబర్ 18 : శ్రీరాంపూర్ కాలనీలో సాందీపని ఆడిటోరియంలో బుధవారం అభయా చారిటబుల్ ట్రస్ట్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ట్రస్ట్ సీఎండీ ఎం రమేశ్, ప్రధాన కార్యదర్శి అగిస్టిన్ పాల్గొని ట్రస్ట్ నూతన కమిటీని నియమించారు. అభయ చారిటబుల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కామిల్ల వియన్ ప్రశాంత్‌ను నియమించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సీఎండీ రమేశ్ మాట్లాడుతూ బాల బాలికల, యువత, మహిళల సాధికారికతకు ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.